వెండితెరపై 'తెనాలి రౌడీ'

కొంగర జగ్గారావు


- విలనీని పండించిన నటుడు
- కాంగ్రెస్ సేవాదళ్ నుంచి సినిమాకు
- ఆర్.నాగేశ్వరరావు మరణంతో ఆహ్వానం
- 'సాక్షి' జగ్గారావుగా, దుశ్శాసనుడిగా గుర్తింపు
- కెరీర్‌లో 500 పైగా చిత్రాల్లో నటన


కొంగర జగ్గారావు

తెనాలి: వెండితెర రౌడీగా తెలుగు సినీపరిశ్రమలో గుర్తింపు పొందిన నటుడు కొంగర జగ్గారావు. కాంగ్రెస్ సేవాదళ్‌లో కీలకంగా పనిచేస్తూ, టంగుటూరి ప్రకాశం పంతులు, గౌతులచ్చన్న, ఎన్జీ రంగా అనుంగు శిష్యుడిగా మెలిగిన జగ్గారావు, అనుకోని పరిస్థితుల్లో తనకిష్టం లేని సినీరంగానికి వెళ్లాల్సి వచ్చింది. విలన్‌కు ప్రత్యామ్నాయం కోసం ముఖానికి మేకప్ వేసుకున్న జగ్గారావు, ఆ విలన్ పాత్రలతోనే రాణించారు. 'భీష్మ', 'శ్రీకృష్ణ పాండవీయం', దానవీరశూర కర్ణ', 'అడవి రాముడు', 'మోసగాళ్లకు మోసగాడు' మొదలుకుని 'అంతఃపురం', 'డాన్' వరకు 500 పైగా సినిమాల్లో నటించారు. 'సాక్షి' జగ్గారావుగా, దుశ్శాసనుడిగా ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోయారు. ఈనెల 26న ఆయన శతజయంతి సందర్భంగా...

మోరంపూడి స్వగ్రామం..


తెనాలి దగ్గర్లోని దుగ్గిరాల మండల గ్రామం మోరంపూడి జగ్గారావు సొంతూరు. 'కళావాచస్పతి' కొంగర జగ్గయ్యకు దగ్గర బంధువు. తల్లిదండ్రులు ఈశ్వరమ్మ, వెంకటప్పయ్య. 1925 ఆగస్టు 26న జన్మించారు. ఊళ్లోని ప్రాథమిక విద్యతో సరిపెట్టుకుని పసుపు వ్యాపారంలో ఉన్న తండ్రికి తోడుగా ఉండసాగాడు జగ్గారావు. నేతాజీ, గాంధీ అంటే ఇష్టంతో 'ఆలిండియా కాంగ్రెస్ సేవాదళ్'లో అధికారిగా శిక్షణకోసం నాగపూర్ వెళ్లాడు. అనంతరం రాష్ట్ర సేవాదళ్‌ను ఆర్గనైజ్ చేస్తూ గౌతు లచ్చన్న ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలు చేస్తుండేవారు. కార్యకర్తలకు డ్రిల్, కర్రసాము శిక్షణతో బిజీగా ఉంటూ వచ్చాడు. తురుమెళ్లకు చెందిన పర్వతనేని శాంతాదేవితో వివాహమైంది. కుటుంబం కోసం ఉద్యోగం తప్పనిసరైంది. ఎన్జీ రంగా సిఫార్సుతో మాచర్లలోని సిమెంట్ ఫ్యాక్టరీలో ట్రాన్స్‌పోర్ట్ అసిస్టెంట్‌గా చేరారు. మకాం అక్కడకు మారింది.


విశ్రాంత జీవనంలో

ఆర్.నాగేశ్వరరావుతో మృతితో..

అప్పట్లో సినిమాల్లో ఆర్.నాగేశ్వరరావు విలన్‌గా చేస్తుండేవారు. జగ్గారావును చూసినవారు ఆ నటుడితోనే పోలుస్తుండేవారు. జగ్గారావుకు మాత్రం సినిమాలంటే ఇష్టం ఉండేది కాదు. తెనాలికి చెందిన సినీనిర్మాత, రచయిత చక్రపాణి బంధువు నలజాల సుబ్బారావు ఒకరోజు వచ్చి, అర్జెంటు అంటూ జగ్గారావును మద్రాస్ తీసుకెళ్లారు.

రేలంగి తీస్తున్న 'సమాజం' సినిమాలో నటిస్తున్న ఆర్.నాగేశ్వరరావు చనిపోయారు. ఆ స్థానంలో నటించాలని కోరటంతో కాదనలేకపోయారు జగ్గారావు. మేకప్ వేశాక 'అచ్చు ఆర్.నాగేశ్వరావే' అన్నారు. పాండీబజారుకు పాకిందా వార్త. ఎన్టీఆర్ నటిస్తున్న 'భీష్మ' సినిమాకూ పిలుపొచ్చింది. దుశ్శాసనుడి వేషం ఇచ్చారు. ఆ విధంగా ఆర్.నాగేశ్వరరావు చనిపోయి జగ్గారావును సినిమారంగానికి తీసుకొచ్చినట్టయింది.


సాధారణ ఆహార్యంలో

'భీష్మ'తోనే ఎన్టీఆర్‌తో స్నేహం కుదిరింది.

'భీష్మ'తోనే ఎన్టీఆర్‌తో స్నేహం కుదిరింది. ఎన్టీఆర్ తీసే సినిమాల్లోనే కాకుండా ఆయన నటించే ఇతర నిర్మాతల సినిమాలకూ జగ్గారావును సిఫార్సు చేసేవారు. ఇక విఠలాచార్య సినిమాల్లో తప్పనిసరి అవకాశం ఉండేది. తనతోపాటు ఆనందమోహన్, త్యాగరాజు, రాజనాల, సత్యనారాయణ విలన్లుగా ఉండేవారు. వాళ్లు మెయిన్ విలన్లు అయినా జగ్గారావుకో పాత్ర ఉండేది. సినిమాల్లో గుర్రమెక్కడం అంటే భలే సరదా. ఆయన సిగరెట్ తాగే స్టైల్ ప్రత్యేకం! ఫైటింగుల్లో డూప్‌ను ఇష్టపడేవారు కాదు. 'లక్ష్మీకటాక్షం' సినిమాలో ఓ ఫైటింగ్ సీనులో జీవిస్తూ ఎన్టీఆర్ చేతిపై కత్తితో పొడిచారు. తర్వాతిరోజు స్వయంగా కలిసి క్షమాపణ చెప్పారు. ఎన్టీఆర్ తేలిగ్గా తీసుకుని 'డోంట్ వర్రీ బ్రదర్' అనేశారని ఒక సందర్భంగా జగ్గారావు చెప్పారు. 'ప్రాణమిత్రులు' చేస్తుండగా బాపురమణలు పిలిచారు. హీరో కృష్ణతో తీస్తున్న 'సాక్షి' సినిమాలో అవకాశమిచ్చారు. అద్భుతమైన విలనీని పండించి, 'సాక్షి జగ్గారావు'గా నాటి ప్రేక్షకులకు గుర్తుండిపోయారు. ఎస్వీ రంగారావు వేయాల్సిన ఆ వేషాన్ని జగ్గారావుతో వేయించి, ఆయన భవిష్యత్తును బాపురమణలు తీర్చిదిద్దారు. సినిమాలు చేస్తుండగా రెండుసార్లు ప్రమాదం నుంచి బయటపడ్డారు. సినీపరిశ్రమ హైదరాబాద్ తరలిరావటంతో జగ్గారావు కూడా వచ్చేశారు. ఫిలింనగర్‌లో ఉంటూ హౌసింగ్ సొసైటీలో కీలకపాత్రను పోషించారు. 2013 ఫిబ్రవరి 23న కన్నుమూశారు.

క్లుప్తంగా

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు



తెనాలిటౌన్: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకున్నట్లు డీఎల్‌పీఓ స్వరూపరాణి పేర్కొన్నారు. రూరల్ మండలం నందివెలుగులో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వర్షకాలం వరదలు, నీటి నిల్వలు నివారించడం, అంటు వ్యాధుల వ్యాప్తిని అరికట్టడం ముఖ్య ఉద్దేశంగా పేర్కొన్నారు. డెప్యూటీ ఎంపీడీఓ వైవీడీ ప్రసాద్ మాట్లాడుతూ మండల పరిధిలో అన్ని గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.హేమకుమారి పాల్గొన్నారు.

నేడు మొబైల్ షాప్ ఓనర్స్, టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు

నగరంపాలెం: స్థానిక అరండల్‌పేట 2/3వ అడ్డరోడ్డులోని వైన్ డీలర్స్ అసోసియేషన్ హాలులో ఆదివారం మొబైల్‌షాప్ ఓనర్స్, టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు జరగనున్నాయి. అధ్యక్ష పదవికి మొహమ్మద్ మోబీన్‌బాషా, షేక్ బాబు (సెల్‌బాబు), కార్యదర్శి పదవికి పఠాన్ జుబేర్‌ఖాన్, తియ్యా వేణుగోపాల్ పోటీ పడుతున్నారు. కోశాధికారిగా షేక్ జిలాని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం రెండేళ్లు కొనసాగనుంది. అసోసియేషన్‌లో 300 మంది సభ్యత్వం ఉన్నారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎన్నికలు జరగనున్నాయి. సాయంత్రంకల్లా గెలుపు, ఓటమి తేలుందని ఎన్నికల పరిశీలకులు తెలిపారు. అయితే, ఎన్నడూ లేని విధంగా ఈసారి ఎన్నికలు నిర్వహించడంతో నువ్వా-నేనా అనే రీతిలో పోటీ జరగనుంది.

మందు బాబులు ముగ్గురిపై కేసు నమోదు

లక్ష్మీపురం: బహిరంగంగా మద్యం తాగుతున్న ముగ్గురిపై నగరంపాలెం పోలీసులు కేసులు నమోదు చేశారు. చుట్టుగుంట, కె.వి.పి కాలనీ వీఐపీ రోడ్డులో శనివారం రాత్రి నగరంపాలెం పోలీసులు తనిఖీలు చేస్తున్న నేపథ్యంలో ముగ్గురు బహిరంగంగా మద్యం తాగుతున్నట్లు గమనించారు. వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశారు. బహిరంగంగా మద్యం తాగి అసభ్యకరంగా ప్రవర్తించినా, గంజాయి, మత్తు పదార్థాలు తీసుకుని దుర్భాషలాడినా, స్థానికులను ఇబ్బందులకు గురి చేసినా తక్షణమే తమ దృష్టికి తీసుకు రావాలని నగరంపాలెం సీఐ నజీర్ బేగ్ కోరారు.

సురవరంసుధాకర్ రెడ్డికి ఘన నివాళులు



లక్ష్మీపురం: సీపీఐ జాతీయ పూర్వ కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి సీపీఐ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కొత్తపేటలోని జిల్లా కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ సుధాకర్‌రెడ్డి పేద ప్రజల కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత నాయకుడు అని తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ సుధాకర్ రెడ్డి ఉపన్యాసం మొదలుపెడితే ఎంతసేపైనా వినాలని అనిపిస్తుందని తెలిపారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్, ఏపీ అంగన్వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బండారపు యశ్వంత్ శశి, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



మంగళగిరి టౌన్: అమావాస్య సందర్భంగా శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. మంగళగిరి నగర పరిధిలోని శివాలయం వద్ద వున్న శ్రీ పానకాల లక్ష్మీ నరసింహస్వామి వారి మెట్ల మార్గం వద్ద అన్నదాన కార్యక్రమం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ వందేటి సాంబశివరావు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా ప్రతినెల అమావాస్య సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. సభ్యులు పుప్పాల కోటేశ్వరరావు, కర్నాటి శివ సత్యనారాయణ, పెరుమాళ్ల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుడు రెడ్డి ఉమాకు సత్కారం



తెనాలిఅర్బన్: రంగస్థల కళాకారుడు, హార్మోనిస్ట్, కీబోర్డు ప్లేయర్ రెడ్డి ఉమామహేశ్వరరావు సేవలు అభినందనీయమని, స్వయం కృషి పురస్కారం ప్రదాత తన్నీరు శివశంకర్ పేర్కొన్నారు. మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక బోసురోడ్డులోని కార్యాలయంలో శనివారం స్వయంకృషి పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. మండూరుకు చెందిన రంగస్థల కళాకారుడు రెడ్డి ఉమామహేశ్వరరావు సత్కరించి స్వయం కృషి పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తోటకూర వెంకటరమణరావు, పొన్నం విజయకుమార్, దాది సూరయ్య, డి.వెంకటసుబ్రమణేశ్వరరావు, కమ్మెల రజిని, కాళిదాసు వెంకటేశ్వరరావు, చందు నగరాజకుమారి, కె.విజయసారథి, పాతూరి సుబ్రహ్మణ్యం, పెట్టేటి రవికుమార్, శెట్టిపల్లి సుబ్రహ్మణ్యం, కన్నెగంటి మౌనిక పాల్గొన్నారు.

సురవరం మృతి తీరనిలోటు

తెనాలిటౌన్: సీపీఐ అగ్రనాయుడు సురవరం సుధాకర్‌రెడ్డి మృతి తీరనిలోటని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చెరుకుమల్లి సింగారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వామపక్ష ఐక్యతకు ఆయన అందించిన సేవలు మరువరానివని గుర్తు చేశారు.

పరిసరాల పరిశుభ్రతతో దోమలకు చెక్

మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదానసీమ్


మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్

తెనాలిఅర్బన్: పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణ సాధ్యమని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ పేర్కొన్నారు. స్థానిక మారీసుపేటలోని ఎన్‌సీఆర్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యవంతంగా జీవించాలంటే పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు పరిశుభ్రత, నీటి వలన, దోమల వలన వచ్చే వ్యాధులపై అవగాహన ఉండాలని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. నేర్చుకున్న విజ్ఞానాన్ని సమాజానికి ఉపయోగించాలని ఆకాంక్షించారు. హెల్త్ ఆఫీసర్ మువ్వా యేసుబాబు మాట్లాడుతూ భోజనానికి ముందు, మలవిసర్జన తరువాత విద్యార్థులు సబ్బుతో చేతులు శుభ్రంగా చేసుకోవాలని సూచించారు. పట్టణ మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ ఎస్.ఉమాకాంత్ మాట్లాడుతూ దోమల వలన మలేరియా, డెంగీ, ఫైలేరియా, చికెన్‌గూన్యా, మెదడువాపు వంటి వ్యాధులు వస్తాయని చెప్పారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎ.బాలచంద్రమౌళి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పఠాన్ కరిముల్లా, హెల్త్ విజిటర్ కె.సరోజిని, డి.విజయకుమారి, ఏఎస్ఎం తిరుపతమ్మ, మలేరియా సూపర్‌వైజర్ దాసరి శివనాగమల్లేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గుమ్మడి ప్రసాద్, మైలా అప్పారావు, మలేరియా హెల్త్ అసిస్టెంట్‌లు సయ్యద్ కరిముల్లా, షేక్ నవీద్, శరత్‌బాబు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి


ప్రతిజ్ఞ చేస్తున్న జేఎంజే కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

తెనాలిఅర్బన్: క్యాన్సర్ వ్యాధిపై విద్యార్థినులు అవగాహన కలిగిఉండాలని జేఎంజే మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ శాంత సూచించారు. స్థానిక కళాశాలలో శనివారం బసవతారక ఇండో- అమెరికన్ క్యాన్సర్ హాస్పటల్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం పలు రకాల టెస్టులు చేశారు. తెనాలి పరిసరాల గ్రామాల నుంచి వచ్చిన మహిళలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలోప్రిన్సిపాల్ సిస్టర్ శాంత, వైస్‌ప్రిన్సిపాల్ రోజ్‌లిన్ పాల్గొన్నారు.

అప్పాజ్యోస్యులకు కళా విపంచి పురస్కారం


సత్యనారాయణకు పురస్కారం ప్రదానం చేస్తున్న దృశ్యం


'పాప దొరికింది' హాస్య నాటికలో సన్నివేశం

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా తెలుగు వెలుగు ఆత్మీయ పురస్కార సభ నిర్వహించారు. కళావిపంచి అధ్యక్షులు బొప్పన నరసింహారావు ఆధ్వర్యంలో జరగ్గా, గౌరవాధ్యక్షులు రామరాజు శ్రీనివాసరావు సభాధ్యక్షత వహించారు. అనంతరం ఆచార్య అప్పాజ్యోస్యుల సత్యనారాయణకు తెలుగు వెలుగు ఆత్మీయ పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. పలు రంగాల్లో, దేశ విదేశాలలో తెలుగు అభ్యున్నతికి ఆయన చేస్తున్న కృషి మరువ లేనిదని వక్తలు కొనియాడారు. ఆరాధన ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గోవిందరాజులు నాగేశ్వరరావు రచన, నడింపల్లి వెంకటేశ్వరరావు దర్శకత్వం వహించిన పాప దొరికింది (హాస్య నాటిక) నాటిక ఆహూతులను అలరించింది. సభలో నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ప్రముఖ సాహితీవేత్త కందిమళ్ల సాంబశివరావు, సారస్వత కళానిధి డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి, ఉపాధ్యక్షుడు కేసీపీ సిమెంట్ వజ్జా మధుసూదనరావు, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, కళాపోషకులు డి.రామకోటేశ్వరరావు మాట్లాడారు. అనంతరం కళాకారులను, అతిథులను సత్కరించారు.

సిరిపురం కళాశాలలో 'కిశోర వికాసం'

మేడికొండూరు: మండలంలోని సిరిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు కిశోర వికాసం కార్యక్రమం జరిగింది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోక్సో చట్టం, సైబర్ నేరాలు, బాల్య వివాహ నిషేధ చట్టం, పలు రకాల నైపుణ్య అభివృద్ధి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైల్వే చైల్డ్ ప్రొటెక్షన్ హెల్ప్ లైన్ విభాగ అధికారులు లక్ష్మణ్, సావిత్రి, కళాశాల ప్రిన్సిపాల్ మధు కృష్ణ, కళాశాల లెక్చరర్లు శాంతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.సునీత పాల్గొన్నారు.


విశ్వ రహస్యాల అన్వేషణలో ఇస్రో విశేష కృషి

గుంటూరు ఎడ్యుకేషన్: విశ్వ రహస్యాల అన్వేషణలో ఇస్రో విశేష కృషి అసామాన్యమని పూర్వ ఇస్రో, నాసా శాస్త్రవేత్త చందు సాంబశివరావు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా మంగళగిరి మండలం కాజాలోని ఎస్ఎస్‌వీ ఇంటర్నేషనల్ స్కూల్లో విద్యార్థులకు అంతరిక్ష అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సాంబశివరావు మాట్లాడుతూ చంద్రయాన్-3లో భాగంగా చంద్రుని దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండర్ విజయవంతంగా ల్యాండ్ అయిన విజయానికి గుర్తుగా జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. అంతరిక్ష పరిజ్ఞానంపై భావితరాలకు అవగాహన కలిగించేందుకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఆర్యభట్ట నుంచి గగన్‌యాన్ వరకు ప్రాచీన నుంచి అనంతమైన అవకాశాలు అనే అంశంపై ప్రస్తుత ఏడాది అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్నారని వివరించారు. చిల్డ్రన్ స్పేస్ క్లబ్ అధ్యక్షుడు జి.శాంతమూర్తి మాట్లాడుతూ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) 2040లో చంద్రునిపైకి మానవులను పంపేందుకు పరిశోధనలు సాగిస్తోందని తెలిపారు. వచ్చే ఏడాది వ్యోమ మిత్ర రోబోతోపాటు, 2027లో మానవ సహిత అంతరిక్ష యాత్రకు కృషి చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి జాయ్, జీఎం మనోహర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో, ద్విచక్ర వాహనం చోరీ

లక్ష్మీపురం: ఇంటి ముందు పార్కింగ్ చేసిన ఆటో ఉదయం లేచి చూసే సరికి కనిపించక పోవడంతో బాధితుడు ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. కొత్తకాలనీకి చెందిన పాలపర్తి అంకమ్మరావు ఆటో డ్రైవర్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఈనెల 10న రాత్రి ఇంటి ముందు ఆటో పార్కింగ్ చేసి మరుసటి రోజు లేచి చూసేసరికి కనిపించలేదు. చుట్టుపక్కల, రైల్వే స్టేషన్, బస్టాండ్ పార్కింగ్ ప్రదేశాలలో వెతికినా కనిపించక పోవడంతో నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో శనివారం రాత్రి ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీపై నగరంపాలెం పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. కోదండ రామయ్యనగర్ ప్రాంతానికి చెందిన చింతా అయ్యప్ప ఈనెల 9న ఇంటి ముందు ద్విచక్ర వాహనం పార్కింగ్ చేశాడు. మరుసటి రోజు చూసే సరికి కనిపించలేదు. శనివారం రాత్రి నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అష్టలక్ష్మీ అమ్మవారికి లక్ష గాజుల పూజ


లక్ష గాజులతో అమ్మవారు ,


హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

నగరంపాలెం: స్థానిక అరండల్‌పేట అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న కోటి కుంకుమార్చనలు శనివారం ముగిశాయి. ఉదయం శ్రీ చక్ర మహామేరుకు విశేషాభిషేకార్చన, లక్ష గాజులతో అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. శాంతి హోమం, మహా పూర్ణాహుతి, నక్షత్ర హారతి, మంత్ర పుష్పం కలశాల జలంతో భక్తులకు సంప్రోక్షణ జరిగింది. కోటి కుంకుమార్చన ఉత్సవాలకు సహకరించిన వేద పండితులను ప్రధానార్చకులు మర్రిపాటి ప్రసాద్‌శర్మ అభినందించారు.

యూరియా, డీఏపీ సకాలంలో అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చందు సాంబశివుడు

తెనాలిటౌన్: అధిక వర్షాలతో పంటలు నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం ఉచితంగా యూరియా, డీఏపీ పంపిణీ చేయాలని కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు డిమాండ్ చేశారు. స్థానిక మారీసుపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని రైతులు ఇప్పటికి రెండుసార్లు వెద పెట్టి అధిక వర్షాల కారణంగా తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. రైతాంగానికి జరిగిన నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి పరిహారం ఇవ్వాలని కోరారు. అధిక ధరలకు బహిరంగ మార్కెట్‌లో యూరియా, డీఏపీ అమ్ముతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి కట్టడి చేయాలని సూచించారు. సమావేశంలో టి.నాగసూర్యశేఖరరావు, జి.ద్వారక శ్రీనివాస్, మల్లవరపు ప్రసాద్, స్టీవెన్‌బాబు, అనిల్, శంకరరావు, కోటేశ్వరరావు, భీమా రమేష్, చందు అయ్యప్ప, నాగూర్, కార్తిక్, వీరస్వామి, మల్లికార్జునరావు, శ్రీను పాల్గొన్నారు.

డీఎఫ్ఓపై దాడికి పాల్పడ్డ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి


అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన

తెనాలిటౌన్: నంద్యాల డీఎఫ్‌వోపై అధికారపార్టీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి చేసిన దాడి హేయమైన చర్యని కాంగ్రెస్‌పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దారా రామకృష్ణ ఆరోపించారు. స్థానిక ముత్తెంశెట్టిపాలెంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట శనివారం నిరసన తెలిపారు. అధికారం అడ్డుపెట్టుకుని డీఎఫ్ఓపై నంద్యాల ఎమ్మెల్యే అత్యంత దారుణంగా వ్యవహరించారని మండిపడ్డారు. అధికారులపై ప్రజాప్రతినిధులు చేస్తున్న దాడులను ప్రభుత్వం ఖండించాలని డిమాండ్ చేశారు. డీఎఫ్ఓకు న్యాయం జరిగేంత వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కూటమి నాయకులు అధికారులను ఇబ్బందులకు గురి చేస్తే సహించబోమని అన్నారు. కార్యక్రమంలో శ్యామ్, ప్రవీణ్, గోపి, తిరుమలరావు, కోటి, షాలేమ్ పాల్గొన్నారు.

30న విశాఖలో బీసీ మహిళల దీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న కేశన శంకరరావు, బీసీ సంఘం నాయకులు

మంగళగిరి టౌన్: బీసీ మహిళలకు సబ్‌కోటాను ఇస్తూ మహిళా రిజర్వేషన్ చట్టానికి సవరణ చేసిన తరువాతే అమలు జరపాలన్న ప్రధాన డిమాండ్‌పై ఈనెల 30వ తేదీ విశాఖపట్నంలో జరగనున్న మహిళల నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు పిలుపునిచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని రాష్ట్ర బీసీ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేశన మాట్లాడుతూ జాతీయస్థాయిలో జనగణనలో కులగణన జరిగి ఆపై నియోజకవర్గాల పునర్విభజన చేసిన అనంతరమే మహిళా రిజర్వేషన్లను అమలు జరపాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, ఉద్యోగ విభాగ కార్యనిర్వాహక రాష్ట్ర అధ్యక్షులు ఉమామహేశ్వరరావు, గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాక్షరతపై అవగాహన

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో వడ్డేశ్వరం గ్రామంలో ఆర్థిక సాక్షరతపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ మేనేజ్‌మెంట్ అండ్ హ్యూమానిటీస్ డీన్ డాక్టర్ కిషోర్‌బాబు మాట్లాడుతూ యూనివర్సిటీ ఎంబీఏ ఎన్ఎస్ఎస్ విభాగం, ఎంఆర్ ఫ్యూచర్ ఫౌండేషన్, ఎస్‌బీఐ కేఎల్‌యూ బ్రాంచ్ ఆధ్వర్యంలో స్వయం సహాయక, పొదుపు సంఘాలు, డ్వాక్రా గ్రూపు సభ్యులు, చిరు వ్యాపారులు, గ్రామస్తులకు ఆర్థిక సాక్షరతపై అవగాహన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు.